

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 11-12-2025 | సంపుటి - 26 | సంచిక -204 | రూ : 4 | పేజీలు: 8



## యునెస్కో వారసత్వ పండుగగా 'దీపావళి'.. ప్రధాని మోదీ హర్షం

- యునెస్కో వారసత్వ జాబితాలో దీపావళికి చోటు
- భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పులకించిపోతున్నారన్న ప్రధాని
- భారత సంస్కృతికి అపూర్వమైన గుర్తింపు లభిస్తోందన్న కేంద్ర మంత్రి షెకావత్
- ఈ జాబితాలో చేరిన 16వ భారతీయ సాంస్కృతిక అంశంగా దీపావళి

2లో

## స్టార్టప్‌లకు రూ.1000 కోట్లు..

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన



2లో

- తెలంగాణ స్టార్టప్‌ల కోసం రూ.1000 కోట్ల నిధి ఏర్పాటు
- హైదరాబాద్ టీ-హబ్‌లో 'గూగుల్ ఫర్ స్టార్టప్' హబ్ ప్రారంభం
- రాష్ట్రంలో 100 యూనికార్న్ కంపెనీలు రావాలన్నదే లక్ష్యమన్న సీఎం రేవంత్
- స్టార్టప్‌లకు అండగా తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంయుక్త ప్రణాళిక



### అమీర్‌పేట కోచింగ్ సెంటర్‌లో

## అగ్నిప్రమాదం...

- విద్యార్థులందరూ సురక్షితంగా బయటపడటంతో తప్పిన పెను ప్రమాదం

2లో

### మోదీ, రాహుల్ గాంధీ మధ్య

## 88 నిమిషాల భేటీ

- సీఐసీ, ఇతర కమిషనర్ల నియామకాలపై ప్రధానంగా చర్చ
- ప్రభుత్వ ప్రతిపాదనలన్నింటికీ అభ్యంతరం తెలిపిన రాహుల్



2లో

## అగ్రికల్చర్.. ఎక్విప్‌మెంట్ బ్యాంక్..

### సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం



2లో

- సాగు వ్యయం తగ్గించేలా అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంకుల ఏర్పాటు
- పత్తి కొనుగోళ్లలో సీసీఐ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం
- ధరలు పడకుండా హార్వెస్టింగ్ ప్రక్రియలో రేషనలైజేషన్ విధానం
- ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగుకు ప్రోత్సాహం




## భారతీయ టెక్కీలకు కొత్త కష్టాలు.. హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్లు వాయిదా

2లో

## ఏపీకి జూమ్...

### శాన్ ఫ్రాన్సిస్కోలో నారా లోకేశ్ కీలక భేటీ

- అమెరికా పర్యటనలో జూమ్ ఉన్నతాధికారులతో నారా లోకేశ్ భేటీ
- ఏపీలో ఆర్ అండ్ డి, ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- అమరావతి లేదా విశాఖను పరిశీలించాలని కోరిన లోకేశ్
- విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC) ఏర్పాటుపైనా చర్చలు




2లో



2లో

### తిరుమలలో మరో భారీ స్కామ్.. పట్టు శాలువాల పేరుతో

## పాలిస్టర్ దందా..

- మల్బరీ పట్టుకు బదులు పాలిస్టర్ శాలువాల సరఫరా
- పదేళ్లుగా నాసిరకం శాలువాలు అందిస్తున్న సంస్థపై ఆరోపణలు
- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసిన భారీ మోసం
- కుంభకోణంపై ఏసీబీ విచారణకు టీటీడీ తీర్మానం

# అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్... సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 10 : రాష్ట్రంలో రైతులపై సాగు వ్యయ భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ, ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో పంటల ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ప్రారంభించి, అందులో అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను పొందుపరచాలని సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు ఉండాలని, వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష**

202526 ఆర్థిక సంవత్సరానికి గాను 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులకు 7.39 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.4,085 కోట్లు చెల్లించామని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 32 శాతం అధికమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులంతా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వరి రకాల సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**సీసీఐ తీరుపై సీఎం అసహనం**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ల కేటాయింపులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే విషయంలో అనవసర ఇబ్బందులు సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సమస్యలపై వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**వాణిజ్య, ఉద్యాన పంటలపై దృష్టి**

మిర్చి వంటి పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించేందుకు విశ్లేషణా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. ధరలు ఒక్కసారిగా పడిపోకుండా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో 'రేషనలైజేషన్' విధానాన్ని పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల దశలవారీగా పంట మార్కెట్‌కు వచ్చి గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటల కొనుగోలుదారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 45,420 హెక్టార్లలో సాగవుతున్న సుబాబుల్ రైతులకు మార్కెట్‌కు అనుగుణంగా ధర దక్కేలా చూడాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమీర్‌పేట కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 10 : హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట మైత్రీవనంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఈ ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో విద్యార్థులందరూ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే... మైత్రీవనంలోని శివమ్ టెక్నాలజీస్ అనే కోచింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బ్యాటరీలు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, సెంటర్‌లోని విద్యార్థులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాది కోచింగ్ సెంటర్లకు నిలయమైన అమీర్‌పేటలో ఈ ప్రమాదం జరగడం ఆందోళనకు గురిచేసింది.

## మోదీ, రాహుల్ గాంధీ మధ్య 88 నిమిషాల భేటీ

ఢిల్లీ, డిసెంబర్ 10 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య ఈరోజు జరిగిన సమావేశం పార్లమెంట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా జరిగిన ఈ భేటీ ఏకంగా 88 నిమిషాల పాటు కొనసాగడం ఊహాగానాలకు తావిచ్చింది. వాస్తవానికి, ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) నియామకంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ, ఇది ఇంత సుదీర్ఘంగా సాగుతుందని ఎవరూ ఊహించలేదు. నిబంధనల ప్రకారం, సమాచార కమిషన్, ఎన్నికల కమిషన్, విజిలెన్స్ విభాగాల్లో కీలక నియామకాలపై ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన ఒక కేంద్ర మంత్రి కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రధాని కార్యాలయానికి రాహుల్ చేరుకోగా... 1.07 గంటలకు భేటీ ప్రారంభమైంది. అయితే, సమయం గడిచేకొద్దీ సమావేశం అజెండాపై ఎంపీల్లో చర్చ మొదలైంది. అనంతరం, ఈ భేటీలో కేవలం సీఐసీ నియామకం గురించే కాకుండా, మరో 8 మంది సమాచార కమిషనర్లు, ఒక విజిలెన్స్ కమిషనర్ నియామకాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. అయితే, ఈ నియామకాలన్నింటికీ రాహుల్ గాంధీ తన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారని, దానిని లిఖితపూర్వకంగా కూడా సమర్పించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గతంలో ఇలాంటి సమావేశాల్లో ప్రతిపక్ష నేతలు అభ్యంతరాలు తెలపడం సాధారణమే అయినా, ఈసారి భేటీ సుదీర్ఘంగా జరగడమే చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కేంద్ర సమాచార కమిషన్‌లో సీఐసీతో సహా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెప్టెంబర్ 13న హీరాలాల్ సమారియా పదవీ విరమణ చేసినప్పటి నుంచి సీఐసీ పదవి ఖాళీగా ఉంది. కమిషన్‌లో దాదాపు 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

## స్టార్టప్‌లకు రూ.1000 కోట్లు... సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 10 : తెలంగాణలోని స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహాన్ని ప్రకటించింది. స్టార్టప్‌ల అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ నిధిని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో గూగుల్ వంటి పెద్ద సంస్థలుగా ఎదగాలని ఆయన స్టార్టప్‌లకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఏర్పాటు చేసిన 'గూగుల్ ఫర్ స్టార్టప్' హబ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్టార్టప్‌ల వృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "1998లో ఇద్దరు స్నేహితులు కాలిఫోర్నియాలోని ఓ గ్యారేజ్‌లో ప్రారంభించిన స్టార్టప్, ఈరోజు ప్రపంచ దిగ్గజం గూగుల్‌గా నిలిచింది. అదే స్ఫూర్తితో మన స్టార్టప్‌లు కూడా ఎదగాలి" అని ఆయన అన్నారు. ప్రొడక్ట్ ఆధారిత, వినూత్నమైన స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలని సీఎం సూచించారు. గూగుల్, యాపిల్, అమెజాన్ వంటి సంస్థలు 20 ఏళ్ల క్రితం చిన్న స్టార్టప్‌లుగా మొదలై ఇప్పుడు బిలియన్ డాలర్ల కంపెనీలుగా మారాయని గుర్తుచేశారు. "హైదరాబాద్ కేవలం స్టార్టప్ హబ్‌గా మిగిలిపోకూడదు. ఇక్కడి నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ హబ్ ఏర్పాటుతో రాష్ట్రంలో ఆవిష్కరణల వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంయుక్తంగా ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు ప్రోత్సాహం, ప్రతిభను వెలికితీయడం, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం వంటి అంశాలపై పనిచేయనున్నాయి.



### తిరుమలలో మరో భారీ స్కామ్..
## పట్టు శాలువాల పేరుతో పాలిస్టర్ దందా

తిరుమల, డిసెంబర్ 10 : కలియుగ దైవం తిరుమల శ్రీవారి సన్నిధిలో వరుస కుంభకోణాలు బయటపడటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పరకామణిలో చోరీ, కల్తీ నెయ్యి సరఫరా వంటి ఘటనలు మరువక ముందే ఇప్పుడు పట్టు శాలువాల కొనుగోళ్లలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. శ్రీవారికి విరాళాలు ఇచ్చే దాతలు, వీఐపీలకు అందించే మల్బరీ పట్టు శాలువాలకు బదులుగా, ఓ సంస్థ పదేళ్లుగా 100 శాతం పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసినట్లు టీటీడీ విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారిని దర్శించుకునే దాతలు, వీఐపీలకు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించి, పట్టు శాలువాతో సత్కరించడం ఆనవాయతీ. దీని కోసం టీటీడీ ఏటా కోట్ల రూపాయలు వెచ్చించి పట్టు శాలువాలను కొనుగోలు చేస్తుంది. అయితే, నగరికి చెందిన వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ అనే సంస్థ 2015 నుంచి టెండర్ దక్కించుకుని శాలువాలు సరఫరా చేస్తోంది. ఇటీవల టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ఈ శాలువాల నాణ్యతపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టెండర్ నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో, నిర్దిష్టమైన బరువు, పరిమాణంలో శాలువాలు నేయాలి. వాటిపై 'ఓం నమో వేంకటేశాయ' అనే అక్షరాలతో పాటు శంకు, చక్ర నామాలు ఉండాలి. కానీ, సరఫరా అయిన శాలువాలు పూర్తి పాలిస్టర్‌తో ఉన్నాయని తేలింది. కేవలం రూ.350 నుంచి రూ.400 విలువ చేసే ఈ నాసిరకం శాలువాలను ఒక్కొక్కటి రూ.1,389 చొప్పున టీటీడీకి విక్రయించి సంస్థ మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ శాలువాల నమూనాలను బెంగళూరు, ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్ బోర్డ్ ల్యాబ్‌లకు పంపించగా, అవి పాలిస్టర్‌తో తయారైనవేనని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని టీటీడీ పాలకమండలి తీర్మానం చేసింది. దీనిపై దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌ను కోరింది. గతంలో కాంచీపురంలోని ల్యాబ్‌లో పరీక్షించినప్పుడు నమూనాలను మార్పిడి చేసి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## యునెస్కో వారసత్వ పండుగగా 'దీపావళి'.. ప్రధాని మోదీ హర్షం

ఢిల్లీ, డిసెంబర్ 10 : భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగకు ప్రపంచ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. యునెస్కో తన 'మానవ సంస్కృతికి చెందిన వారసత్వ జాబితా'లో దీపావళిని చేర్చినట్లు బుధవారం ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. "భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ వార్తతో పులకించిపోతున్నారు. దీపావళి మన సంస్కృతి, విలువలతో పెనవేసుకుపోయింది. ఇది మన నాగరికతకు ఆత్మ లాంటిది. ఈ గుర్తింపుతో దీపావళి ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా మరింత పెరుగుతుంది. శ్రీరాముడి ఆదర్శాలు మనందరినీ ఎల్లప్పుడూ నడిపించాలి" అని పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా స్పందిస్తూ, ఇది భారత్‌కు చారిత్రక దినమని అభివర్ణించారు. ప్రధాని మోదీ హయాంలో భారత సాంస్కృతిక వారసత్వానికి అపూర్వమైన అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని ఆయన అన్నారు. మొట్టమొదటిసారిగా భారత్ ఆతిథ్యమిస్తున్న యునెస్కో 20వ అంతర్ ప్రభుత్వ కమిటీ సమావేశాలు ఈ నెల 8 నుంచి 13 వరకు ఢిల్లీలోని ఎర్రకోటలో జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లోనే దాదాపు 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను పరిశీలించి, దీపావళికి ఈ గుర్తింపునిస్తున్నట్లు యునెస్కో ప్రకటించింది. ఇప్పటివరకు ఈ జాబితాలో కుంభమేళా, దుర్గాపూజ, గుజరాత్ గర్బా, యోగా సహా 15 భారతీయ అంశాలు ఉండగా, తాజాగా దీపావళి చేరికతో ఈ సంఖ్య 16కి పెరిగింది.

### భారతీయ టెక్కీలకు కొత్త కష్టాలు..
## హెచ్–1బీ వీసా అపాయింట్‌మెంట్లు వాయిదా

అమెరికా, డిసెంబర్ 10: అమెరికా వెళ్లాలనుకునే భారతీయ హెచ్ 1బీ వీసా దరఖాస్తుదారులకు ఊహించని అడ్డంకి ఎదురైంది. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సోషల్ మీడియా తనిఖీల విధానం కారణంగా, భారత్‌లో అనేక వీసా అపాయింట్‌మెంట్లు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. ఈ మార్పులపై భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం రాత్రి దరఖాస్తుదారులకు కీలక సూచనలు జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్ తేదీ మార్చబడినట్లు మీకు ఈమెయిల్ వచ్చి ఉంటే, కొత్త తేదీలో మాత్రమే హాజరు కావాలని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా పాత తేదీలో ఇంటర్వ్యూ కోసం వస్తే, వారిని కాన్సులేట్‌లోకి అనుమతించబోమని హెచ్చరించింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం డిసెంబర్ మధ్య నుంచి చివరి వరకు జరగాల్సిన అనేక ఇంటర్వ్యూలు వచ్చే ఏడాది మార్చి నెలకు మార్చబడ్డాయి. కొత్త నిబంధనల ప్రకారం హెచ్ 1బీ, హెచ్ 4 వీసా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైల్స్ ప్రైవసీ సెట్టింగులను 'పబ్లిక్'గా మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 15 నుంచి అధికారులు వారి ఆన్‌లైన్ కార్యకలాపాలను సమీక్షించి, జాతీయ భద్రతకు ముప్పు కలిగించే వారిని గుర్తిస్తారు. "ప్రతి వీసా మంజూరు ప్రక్రియ ఒక జాతీయ భద్రతా నిర్ణయం" అని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌పై నిఘా పెరిగింది. నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులకు ప్రాథమిక మార్గమైన ఈ వీసాపై ఇప్పటికే అనేక ఆంక్షలు విధించారు. గతంలో హెచ్ 1బీ వీసాలపై 100,000 డాలర్ల రుసుము విధించడం, 19 దేశాల నుంచి గ్రీన్ కార్డ్ దరఖాస్తులను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

### ఏపీకి 'జూమ్'...
## శాన్ ఫ్రాన్సిస్కోలో నారా లోకేశ్ కీలక భేటీ

ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ప్రముఖ వీడియో కమ్యూనికేషన్స్ సంస్థ 'జూమ్' ఉన్నతాధికారులతో శాన్ ఫ్రాన్సిస్కోలో సమావేశమయ్యారు. ఈ భేటీలో జూమ్ సంస్థ ప్రొడక్ట్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బావాతో లోకేశ్ చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్రంలోని అమరావతి లేదా విశాఖపట్నంలో జూమ్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి), ఇంజనీరింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ వారిని కోరారు. అలాగే, విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC) ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం ఉందని లోకేశ్ వారికి తెలిపారు. ఈ సమావేశం వివరాలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## రెండు నెలల పాటు పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే

తిరుమల, డిసెంబర్ 10 : డిసెంబరు, వచ్చే ఏడాది జనవరిలో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఆయా రోజుల్లో రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం), 29న (వైకుంఠ ఏకాదశి ముందు రోజు), డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు (వైకుంఠ ద్వార దర్శనాలు), జనవరి 25 (రథ సప్తమి) కారణంగా ఈ పర్వదినాల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తితిదే ప్రకటనలో పేర్కొంది. పర్వదినాలకు ముందురోజు వీఐపీ దర్శనాలకు



సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి భక్తులు దేవస్థానం సిబ్బందికి సహకరించాలని కోరింది.

# రామవరం హైస్కూల్‌లో మొక్కలు నాటి ప్రకృతి ప్రేమికులు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రవాణా శాఖ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్‌గా, ప్రకృతి హరిత దీక్ష గౌరవ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్న సంఘం వెంకట పుల్లయ్య పుట్టినరోజు సందర్భంగా రామవరం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి హరిత దీక్ష కుడు మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్ష కురాలు నైనిక రజువా, కాంగ్రెస్ నాయకుడు బత్తిని రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

* **తనూజ పుట్టిన రోజు– 1989వ రోజు మొక్క నాటిన కె.ఎన్. రాజశేఖర్**

హైదరాబాద్ సీనియర్ జర్నలిస్టు రవికుమార్




,ప్రసన్నల కుమార్తె తనూజ పుట్టిన రోజును పురస్కరించుకొని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ మొక్కలు నాటే 1989వ రోజుగా ప్రకృతి హరిత దీక్ష కుడు కె.ఎన్. రాజశేఖర్ సపోటా మొక్కను నాటారు.నిరంతర హరిత సేవలకు గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 114వ మన్ కీ బాత్ కార్యక్రమంలో రాజశేఖర్‌కు ప్రత్యేక ప్రశంసలు లభించిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు బత్తిని రాజశేఖర్, నైనిక రజువా, విద్యార్థులు పాల్గొన్నారు.

* **"ఏక్ పెడ్ మా కే నామ్" రాజశేఖర్ పిలుపు**

ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలి. పుట్టినరోజులు, పెళ్లివార్షికోత్సవాలు, శుభకార్యాలలో తప్పనిసరిగా మొక్కలు నాటాలి" అని పిలుపునిచ్చారు. తనూజ పుట్టిన రోజున తాతయ్య సుబ్బరాయుడు, నానమ్మ లలిత, నాన్న రవికుమార్, అమ్మ ప్రసన్న,అన్నయ్య నికిల్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: తీగుళ్ళ చంద్రయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజలు ఓటు వేసి ఆశీర్వదిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని చిన్న కొండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తీగుళ్ళ చంద్రయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ కలియ తిరిగారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలు, వృద్ధులు, యువతను ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. బ్యాట్ గుర్తుకు వేటు ఓటు వేయాలంటూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీగుళ్ల చంద్రయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగానన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన చోట్ల సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి ధ్యేయంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. బ్యాటు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అక్రమంగా తరలిస్తున్న మద్యంను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి మొర్రాయిపల్లి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 7.2లీటర్ల 7920 రూపాయల విలువజేసే మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. అరుణ్ కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ముస్తాబాద్ నుంచి దుబ్బాక మండలంలోని రాజక్కపేట గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 11.7 లీటర్ల 2925 విలువజేసే మద్యంను పట్టుకున్నట్లు, పాతూరి బాల్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమ డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

## డాక్టర్ ప్రభుదయాల్ సేవలకు రాష్ట్ర స్థాయి ప్రశంస



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం, నోడల్ అధికారి, కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారిగా నిజాయితీ, నిబద్ధతతో సేవలు అందించిన డాక్టర్ ప్రభుదయాల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. గత ఆగస్టులో పదవీ విరమణ చేసిన ఆయన విద్యారంగానికి చేసిన సేవలను ప్రశంసిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగిత రానా (ఐఏఎస్) ప్రత్యేక లేఖ పంపించారు. సర్కారు పాఠశాల ఉద్ధరణ, మండల విద్యాశాఖ పనితీరును అగ్రస్థానంలో నిలుపడంలో దయాల్ చూపిన అంకితభావం అభినందనీయమని లేఖలో పేర్కొన్నారు. ఆయన రాస్తున్న విద్యా వ్యాసాలు, సూచనలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని, ముఖ్యాంశాలను స్వయంగా పరిశీలిస్తున్నట్లు రానా పేర్కొన్నారు. విద్యారంగానికై దయాల్ చేసిన నిస్వార్థ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఆమె ప్రశంసించారు. ఇదిలా ఉండగా, దయాల్ కార్యాచరణపై పలువురు ఐఏఎస్ అధికారులు ఆయన సర్వీస్ రిజిస్టర్‌లో స్వహస్తాలతో ప్రశంసలు రాయడం అరుదైన ఘనతగా నిలిచింది. ఇది ఒక రికార్డు అని అధికారులు అన్నారు.

## పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై అవగాహన




జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీలో గల లూయిస్ బ్రెయిలి భవన్ లో పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టాఫీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి , ఫ్రిప్ ప్రవీణ్, పోస్ట్ మాస్టర్‌రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ ద్వారా ఏ ఏ సేవలు అందుతున్నాయో , పోస్ట్ ఆఫీస్ లో పొదుపు ఖాతాలు , సుకన్యా యోజన ఇన్సూరెన్స్ లాంటి వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు.

## ఆదరించి.. ఆశీర్వదించండి: మర్రి వంశీధర్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజలు ఆదరించి తనకు ఓటు వేసి ఆశీర్వదిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మసీదుగూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మర్రి వంశీధర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం మసీదుగూడెం గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో యువతకు ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతోనే సర్పంచ్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను గ్రామ ప్రజలకు అందిస్తానన్నారు. గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన తనను కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా 1వ వార్డు అభ్యర్థిగా తోట లింగస్వామి (గ్యాస్ స్టౌవ్), 2వ వార్డు అభ్యర్థిగా పల్సం జయమ్మ(గ్యాస్ స్టౌవ్), 3వ వార్డు అభ్యర్థిగా గూడూరు భారతమ్మ (గ్యాస్ స్టౌవ్), 4వ వార్డు అభ్యర్థి దొంతరబోయిన రమేష్ (గ్యాస్ స్టౌవ్), 5వ వార్డు అభ్యర్థిగా సూరి అనిత భూపాల్ రెడ్డి (స్టూల్), 6వ వార్డు అభ్యర్థిగా చెక్క లింగస్వామి(గౌన్) గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని వార్డు అభ్యర్థులు కోరారు.



## బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తిరుపెళ్ళి బాపురెడ్డి జోరుగా ప్రచారం

ఆలేరు, ప్రజాస్ఫూర్తి: ఆలేరు మండలం గొలనుకొండలో చివరి రోజు గొలనుకొండ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తిరుపెళ్ళి బాపురెడ్డి గెలుపు కోరుతూ లేడీస్ పర్స్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం చేశారు, అనంతరం గొలనుకొండ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తిరుపెళ్ళి బాపురెడ్డి మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఓటర్లకు తెలిపారు.మరియు గొలనుకొండ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైనా కూడా గ్రామ పంచాయతీలకు నిధులను కేటాయించక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గొలనుకొండ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగడి సునీత మహేందర్ రెడ్డి కృషి చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాకీ శ్రీను,శ్రీపతి బుచ్చయ్య,కొమ్మరాజుల వెంకటేష్,బలంతుల అశోక్, శ్రీపతి వీరస్వామి,ఎగమామిడి లక్ష్మారెడ్డి,గండి నరసింహ,బైరపాక సుప్రదీప్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు




## ప్రజల విశ్వాసమే పార్టీ బలం

**: జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల నమ్మకం, విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేసేది సిపిఐ పార్టీ అని జిల్లా కార్యదర్శి ఎస్. సాబీర్ పాషా స్పష్టంచేశారు. పోరాటాలతో ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టు పార్టీ ధర్మమని ఆయన అన్నారు.2 ఇంక్లైన్ పంచాయతీలో సర్పంచ్ గుగులోత్ అరుణతో పాటు 8 వార్డులు ఏకగ్రీవంగా సిపిఐదగ్గరికి రావడం ప్రజా విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. విజయవంతమైన సర్పంచ్, వార్డు సభ్యులు బుధవారం జిల్లా నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి నియోజకవర్గానికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెచ్చి ప్రాంతాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చుతున్నారని సాబీర్ పాషా ప్రశంసించారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో మరిన్ని పంచాయతీలను సిపిఐ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో తూముల శ్రీనివాస్, మొహమ్మద్ అంకుష్, సింగిరాల రమేష్, మాజీ సర్పంచ్ గుగులోత్ నగేష్ తదితరులు పాల్గొన్నారు. 2 ఇంక్లైన్ సిపిఐ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ ప్రజలకు సాబీర్ పాషా శుభాకాంక్షలు తెలిపారు.

## నాయకునిగా కాదు.. సేవకునిగా పనిచేస్తా

- **దండు మల్కాపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఒక్కసారి ప్రజలు అవకాశం ఇచ్చి బ్యాటు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే గ్రామ సేవకునిగా పనిచేస్తూ గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని దండు మల్కాపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్ బుదవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్యాటు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళలకు రూ.2500లు, వృద్ధాప్య పెన్షన్లు రూ.4వేలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులు నేడు మచ్చుకైనా కనిపించడం లేదని గ్రామాలలో ఉండే ప్రజలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గ్రామంలో ప్రజలు ఆలోచించి గ్రామాలను అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమన్నారు. సర్పంచ్ గా ఒక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అందరి సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. బ్యాట్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## పోలింగ్, కౌంటింగ్ పారదర్శకంగా చేపట్టాలి

* **అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ....**
* **గ్రామాలకు తరలిన పోలింగ్ సామాగ్రి, సిబ్బంది.**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి: పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించి కౌంటింగ్ చేపట్టాలని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం రాజపేట మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో పోలింగ్ సామాగ్రి పంపిణీ గ్రామాలకు సిబ్బంది తరలింపు కార్యక్రమాన్ని చేపడుతున్న సందర్భంగా ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ అర్జున్ రెడ్డి స్టేషన్ ఇన్చార్జి ప్రకాష్ లు పాల్గొన్నారు.రాజపేట మండలంలో ఈనెల 11వ తేదీ గురువారం జరగనున్న సర్పంచి వార్డు సభ్యుల పోలింగ్ కౌంటింగ్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. మండల అభివృద్ధి అధికారి నాగవేణి కి, మండల విద్యాధికారి చందా రమేష్, మండల పంచాయత్ అధికారి ఆవుల కిషన్, మండల పర్యవేక్షకులు ఇన్నారెడ్డి లకు ఎన్నికల గురించి తగు సూచనలు చేసి ఎన్నికలు సజావుగా జరగాలని ఆదేశించారు. మండలానికి కేటాయించబడిన జోనల్ అధికారులు బస్సులు వివరములు రోడ్డు వివరములు పోలింగ్ స్టాఫ్ పిఓ, ఓపిఓ, స్టేజ్ టు అధికారుల వివరములు ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు. రాజపేట మండలంలో మొత్తం 16 రూట్లలో 16 బస్సులను ఏర్పాటు చేసినట్లు నాలుగు జోన్లుగా విభజించి 230 పిఓలు 230 ఓపిఓ లను 25 స్టేజ్ టు ఆఫీసర్లను నియమించినట్లు ఎంపీడీవో చెప్పారు. మండలంలోని 21 గ్రామపంచాయతీలో సర్పంచి వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయని వివరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలు ఉంటాయని సిఐ మాదాసు శంకర్ గౌడ్ చెప్పారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ భోజనానంతరం కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

## సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలి

**ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్య ఆత్మక వ్యక్తులను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు..ఈ సందర్భంగా సబ్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పంచాయతీల వారీగా ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధులను నిర్వర్తించే అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నియమాలని కచ్చితంగా పాటించాలని సూచించారు.ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, 2టౌన్ సీఐ ప్రతాప్,జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణా రెడ్డి, మరవి, రమాదేవి, జయసింహారెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎలక్ట్రిక్ బస్సులతో నగరాన్ని కాలుష్య రహితంగా మారుస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ను కాలుష్యం రహితంగా మార్చేందుకు నగరంలో మరిన్ని ఎలక్ట్రికల్ బస్సులను తీసుకుని వస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ రాణిగంజ్ బస్సు డిపోలో బుధవారం నూతనంగా తీసుకువచ్చిన 65 ఎలక్ట్రికల్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆయనతో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, స్థానిక రాంగోపాల్ పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చే ప్రక్రియలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను నడపడం




జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీని కనెక్ట్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఆర్టీసీలో నూతన బస్సుల కొనుగోలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కోర్ అర్బన్ ప్రాంతంగా రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాలు విలీనం అయ్యాయని అర్బన్, సెమీ అర్బన్, రూరల్ గా విభజించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చాలా కాలనీలకు ఇంకా బస్సులు రావడం లేదని ప్రజా రవాణా వ్యవస్థను ఇంకా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి రెండు నెలలుగా ఎక్కడెక్కడ బస్సులు నడపాలని సర్వే చేశామని తెలిపారు. హైదరబాద్ నగర ప్రజలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్కడెక్కడ ఆర్టీసీ బస్సులు అవసరం ఉన్నాయో ఆర్టీసీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలపవచ్చునని అన్నారు. ఐటీ కారిడార్లో కూడా కార్యాలయాలు ఉన్నాయో అక్కడికి కావాల్సిన బస్సులు వేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజల సలహాలు సూచనల మేరకు ఆర్టీసీ సేవలు మరింత పెంచుతామని తెలిపారు. ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో ఇప్పటి వరకు 251 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్టు వెల్లడించారు. నగరంలో సుమారు 8 వందల ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని జీహెచ్ఎంసీ పరిధిలో రానున్న రెండేళ్లలో మొత్తంగా 2800 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని చెప్పారు. 31 శాతంగా మహాలక్ష్మి స్కీంలో నడిచే బస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి బస్సులో తార్నాక వరకు బస్సులో ప్రయాణించారు.



## నిషేధిత మాన్ జాను
# విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే కె.పి.వివేకానందు్క వినతి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కొందరు వ్యాపారస్తులు దొంగచాటుగా నిషేధిత మాన్ జాను (దారాన్ని) విక్రయిస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా కృషి చేయాలని బుధవారం పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మాన్ జాను (దారాన్ని) వాడడంతో రోడ్లపై వెళ్లే ద్విచక్ర వాహణ దారులకు,పక్షులకు ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఒక మిలిటరీ అధికారి కూడా దారంతో తెగి చనిపోవడం జరిగిందన్నారు. ఇటీవల హైదరాబాదులో కూడా ఇటువంటి సంఘటన జరిగిందన్నారు. విక్రయ దారులపై చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి తమరు అర్డార్ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మన్నన్, డాక్టర్ హుస్సేన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

**: డీజీపీ శివధర్‌రెడ్డి**

హైదరాబాద్: తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను



నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

# వరద ముప్పులేని నగరమే లక్ష్యం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్

'అసాధారణ వర్షాలు పడుతున్నాయి. ఒకే రోజు 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అవుతోంది. ఇలాంటి తరుణంలో వరద నీరు సాఫీగా సాగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. వరద ముప్పు లేని నగరం అందరి లక్ష్యం కావాలి' అని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. జీహెచ్ఎంసీ మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నుంచి ప్రారంభంకానున్న డీసిల్టింగ్ పనుల నేపథ్యంలో జీహెచ్ఎంసీ మెయింటినెన్స్ విభాగం, హైడ్రా అధికారులతో బుధవారం హైడ్రా కార్యాలయంలో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో హైడ్రా కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా తర్వాత వరద నియంత్రణలో విజయవంతమయ్యామన్నారు. క్యాచ్ పిట్లు, కల్వర్టులలో సిల్ట్ ను తొలగించేది హైడ్రా పని అయినప్పటికీ.. ప్రధాన నాలాల్లో పూడికను కూడా తొలగించామని చెప్పారు. ఈ వర్షాకాలంలో అనుభవంలోకి వచ్చిన సమస్యలు ఎన్నో పాఠాలు నేర్పాయని.. వచ్చే ఏడాది మరింత సమర్థవంతంగా పని చేయడానికి ఇవన్నీ ఊతమిస్తాయని అన్నారు. డీసిల్టింగ్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి.. వరద నీరు సాఫీగా సాగడానికి హైడ్రా సహకారం అన్ని విభాగాలకు అందుతుందన్నారు.

**స్థానికుల భాగస్వామ్యంతో..**

నాలాల్లో డీసిల్టింగ్ పనులను జనవరి నుంచే మొదలు పెడుతున్నామని, వీటి పర్యవేక్షణలో స్థానికులతో పాటు.. ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేద్దామని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అధికారులకు సూచించారు.



నాలా నెట్ వర్కుకు ఎక్కడైనా ఆటంకాలతో పాటు.. ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించడంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలన్నారు. అప్పుడే వాటి నిర్వహణలో అందరూ జాగ్రత్తలు పడతారన్నారు. బస్తీబాట అనే కార్యక్రమాన్ని చేపట్టి నాలాల్లో పూడిక తీసే పనుల్లో స్థానికుల సహకారం అందేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. టోలీచౌకి, గౌరిశంకర్ నగర్ కాలనీ నాలాల్లో పూడిక తీసినప్పుడు వారం, పది రోజుల ఇబ్బందులు పడినా పూర్తి సహకారం అందించారన్నారు. ఇదే పరిస్థితి పాతబస్తీ యాఖుత్పురాలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు.. పబ్లిక్ నుంచి సహకారం అందిందన్నారు.

*** కచ్చితంగా నాలాల్లో పూడిక తీయాల్సిందే..**

నాలాల్లో పూడిక తీసే పనుల్లో ఎలాంటి రాజీ పడాల్సినవసరం లేదని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అధికారులకు స్పష్టం చేశారు. ఇది తమ పరిధిలోకి రాదని.. ఇంత పూడికను మేము తీయమని కాంట్రాక్టర్లు అనడానికి వీలు లేకుండా.. పనులు పూర్తి చేయాలని సూచించారు. అమీర్పేటలోని మైత్రివనం వద్ద పూడుకుపోయిన భూగర్భ డ్రైనేజీ లైన్లను క్లియర్ చేయడం.., సికింద్రాబాద్ లోని ప్యాట్నీ నాలాపై ఉన్న ఆక్రమణలు తొలగించి విస్తరించడంతో ఆ రెండు ప్రాంతాల్లో వరద ముప్పు లేకుండా చేసిన విషయాన్ని కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకరిద్దరి సమస్యకంటే వందలు, వేలాది మంది సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేయాల్సి ఉందన్నారు. మరీ ముఖ్యంగా.. నాలాల్లో పూడికను తొలగించడం ఎంత ముఖ్యమో.. వాటి నిర్వహణకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, జీహెచ్ఎంసీ మెయింటినెన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ జ్యోతిర్మయితో పాటు పలువురు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, హైడ్రా ఆర్ఎఫ్వో జయప్రకాష్, డీఎఫ్వోలు, ఎస్ఎఫ్వోలు, హైడ్రా అసెట్ ప్రొటెక్షన్ ఇన్స్పెక్టర్లు పాల్గొని స్థానికంగా తలెత్తిన సమస్యలను వివరించారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..
# 890 గ్రామాల్లో ఏకగ్రీవం: ఎస్ఈసీ

హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని



చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.

# నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ

**: మహేశ్ గౌడ్**

హైదరాబాద్: నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని చెప్పారు. ఈ సమ్మిట్‌పై భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. సమ్మిట్‌లో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. కంపెనీల ప్రొఫైల్ చూడకుండా ఒప్పందాలు జరగవన్నారు.




ఫ్యూచర్ సిటీ.. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని చెప్పారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



# డీజీపీని కలిసిన ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులు

రాష్ట్రానికి కొత్తగా కేటాయించిన ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 2023 బ్యాచ్‌కు చెందిన మండారే సోహమ్ సునీల్, రాహుల్ కాంత్, ఆయేషా ఫాతిమా, 2024 బ్యాచ్‌కు చెందిన మనీషా నెహ్రా డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో నేరాల పరిస్థితి గురించి డీజీపీ వారికి వివరించారు. త్వరగా తెలుగు భాషతో పాటు తెలంగాణ మాండలికాన్ని కూడా నేర్చుకోవాలని సూచించారు. మహారాష్ట్రకు చెందిన మండారే సోహమ్ సునీల్ కరీంనగర్ కమిషనరేట్ లో, జార్ఖండ్‌కు చెందిన రాహుల్ కాంత్ ఆదిలాబాద్ జిల్లాలో, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయేషా ఫాతిమా సిద్దిపేట కమిషనరేట్ లో, రాజస్థాన్‌కు చెందిన మనీషా నెహ్రా ములుగు జిల్లాలో శిక్షణ పొందనున్నారు.

# విత్తన చట్టం రైతాంగం శ్రేయస్సుకు బాటలు వేయాలి..

*** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

విత్తన చట్టం2025 భారత రైతాంగం శ్రేయస్సుకు బాటలు వేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ముసాయిదా విత్తన చట్టం2025లో రైతుల ప్రయోజనం దృష్ట్యా చేర్చాల్సిన, మార్చాల్సిన అంశాలపై తుది నివేదిక సిద్ధం చేశామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అభ్యంతరాలను ఈనెల 11లోపు తెలపాలని కోరిందని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సెక్రెటేరియట్ లో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం అయ్యారు. తుది నివేదిక రూపకల్పనలో చేర్చాల్సిన, మార్చాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు విత్తనోత్పత్తి కీలకమని, సాంప్రదాయ, స్వదేశీ రకాలు సహా అధికనాణ్యత గల విత్తనాల సాగు, సంరక్షణలో వేలాది మంది రైతులు భాగస్వాములుగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వారి సహకారం చాలా ముఖ్యమైనది అయినప్పటికీ, విత్తన రైతులు తరచుగా అధికారిక గుర్తింపు లేకపోవడం, లోపభూయిష్ట ఒప్పంద నిబంధనలు, సరైన పరిహారం అందకపోవడం వంటి ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. పదేళ్ళ కాలంలో విత్తనోత్పత్తి



సమస్యలతోపాటు, ముఖ్యంగా పత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు పండించే రైతులు నకిలీ, నాసిరకం, అనుమతి లేని, అధిక ధర కలిగిన విత్తనాల వ్యాప్తి కారణంగా నష్టాలను చవిచూశారని తెలిపారు. విత్తనచట్టం 1966 తదనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన 2004, 2010, 2019 నాటి విత్తన బిల్లు ముసాయిదాలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను, హక్కులను పరిరక్షించడంలో ప్రభావవంతమైన చట్టాలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కఠిన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలు మార్పులు చేర్పులకు సంబంధించి వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రెటరీ సురేంద్రమోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా డీసీఏ విస్తృత తనిఖీలు.. 180 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు

యువతను వ్యసనంగా మార్చే ఔషధాలు, గర్భస్రావ కిట్లు, యాంటీ బయాటిక్ మందుల అనియంత్రిత అమ్మకాలపై కట్టడి చేయడం లక్ష్యంగా తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 180 రిటైల్ మెడికల్ షాపుల్లో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. షెడ్యూల్ హెచ్, షెడ్యూల్ హెచ్ 1కింద వచ్చే ప్రిస్క్రిప్షన్ ఔషధాల విక్రయ రికార్డులను అధికారులు పరిశీలించారు. రిజిస్టర్డ్ వైద్యులు ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మాత్రమే ఈ మందులు విక్రయించాల్సి ఉండగా ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్ల నిర్వహణ, రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండానే ఔషధాలు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. గడువు ముగిసిన మందులు, సరిగా నిల్వ చేయని ఔషధాలు లాంటి అంశాలు బయటపడ్డాయి. ఈ ఉల్లంఘనల ఆధారంగా 180 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షహనవాజ్ ఖాసిమ్ తెలిపారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్ యాక్ట్, 1940 మరియు సంబంధిత నియమాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

# ఇండిగో కార్యకలాపాలపై కేంద్రం నజర్.. పర్యవేక్షణ బృందం ఏర్పాటు

'ఇండిగో' వ్యవహారంలో 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' మరిన్ని కీలక చర్యలు తీసుకుంది. ఆ సంస్థ కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించేందుకు ఎనిమిది మంది సభ్యులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యవేక్షణ బృందంలో ఓ డిప్యూటీ చీఫ్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లు, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లను నియమించింది. పర్యవేక్షణ బృందంలోని ఇద్దరు సభ్యులను గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయంలో ఉంచనుంది. మొత్తం విమానాలు, పైలట్ల సంఖ్య; రోజువారీ సర్వీసులు; సగటు ప్రయాణ దూరం; స్టాండ్‌బై, శిక్షణలో ఉన్న సిబ్బంది; ప్రణాళికాబద్ధంగా లేని సెలవులు; సిబ్బంది కొరతతో ప్రభావితమవుతున్న విభాగాలు; నెట్‌వర్క్ తదితర వ్యవహారాలను ఈ సభ్యులు పర్యవేక్షిస్తారని డీజీసీఏ తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ విమానాల రద్దు, రీఫండ్, సమయపాలన, ప్రయాణికులకు పరిహారం, లగేజీ అప్పగింత అంశాలను మరో ఇద్దరు డీజీసీఏ అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొంది. ఈ రెండు బృందాలు రోజూ సాయంత్రం 6 గంటల్లోపు జాయింట్ డైరెక్టర్ జనరల్ (అడ్మినిస్ట్రేషన్) హరీష్‌కుమార్ వశిష్ట్, జాయింట్ డైరెక్టర్ జనరల్ జైప్రకాశ్ పాండేలకు నివేదికలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పింది. అదేవిధంగా 11 దేశీయ విమానాశ్రయాల్లో ఇండిగో కార్యకలాపాలను పరిశీలించేందుకు డీజీసీఏ సీనియర్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఇండిగో సేవల అంతరాయంలో దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు.. సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను ఈ నెల 11న తమ ముందు హాజరుకావాలని బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అంతరాయాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని సూచించింది.




### సెంట్రల్ ప్యానల్ చీఫ్‌ల ఎంపిక..
## మోదీతో విభేదించిన రాహుల్



కేంద్ర సమాచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి కీలకమైన సెంట్రల్ ప్యానళ్ల చీఫ్‌ల ఎంపికలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీతో విభేదించారు. పారదర్శక సంస్థలకు నియామకాలను ఖరారు చేయడానికి బుధవారం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అత్యున్నత పదవులకు ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్లు పేర్కొంటూ.. లిఖితపూర్వక అసమ్మతి నోట్‌ను అందజేశారు. అయితే సెంట్రల్ ప్యానళ్ల చీఫ్‌ల ఎంపికలో షార్ట్‌లిస్ట్ చేసిన అధికారులకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. మంగళవారం లోక్‌సభ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ..దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఈసీని భాజపా వాడుకుంటోందని ఆరోపించిన విషయం తెలిసిందే. తన ప్రసంగానికి సంబంధించిన వీడియోను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో షేర్‌చేశారు. ఎన్నికల్లో అవకతవకలపై లోక్‌సభలో తాను కేంద్రాన్ని అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానం ఒకటేనని పేర్కొన్నారు. అది ఓట్ల చోరీకి భాజపా ఎన్నికల కమిషన్‌ను ఓ సాధనంగా వాడుకోవడమేనని రాసుకొచ్చారు.

## కాంగ్రెస్ ఓటమికి అదే కారణం.. ఈవీఎంలు, ఓటు చోరీ కాదు– అమిత్ షా

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్రమంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. రాజ్యాంగం ప్రకారమే ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపడుతోందన్నారు. తప్పుడు మార్గాల్లో ఇక గెలవలేమని విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారణం దాని నాయకత్వమే తప్ప ఈవీఎంలు లేదా ఓటు చోరీ కాదన్నారు. లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. అక్రమ చొరబాటుదారులను ఓటరు జాబితాలో ఉంచేందుకే విపక్షాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే..**

"జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు 1952లో తొలిసారి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టారు. 1946లో ఓటు చోరీతో నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. (1946లో కాంగ్రెస్ అధ్యక్షపదవికి మెజార్టీ పీసీసీలు పటేల్‌ను ప్రతిపాదించాయి.) ఇందిరాగాంధీ కూడా ఓటు చోరీకి పాల్పడ్డారు. భారత పౌరురాలు కాకముందే సోనియా గాంధీ ఓటరుగా అయ్యారన్న అంశం ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది'' అని అమిత్ షా పేర్కొన్నారు. "2004 వరకు ఏ పార్టీ కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకించలేదు. ఓటరు జాబితాలో చనిపోయిన వారిని, విదేశీయులను



గుర్తించి, తొలగించేందుకే దీన్ని చేపడుతున్నాం. భారత ఎన్నికల ప్రక్రియలో అక్రమ వలసదారులు భాగస్వామ్యం కావాలా? ఓటరు జాబితాలో అక్రమ వలసదారులను ఉంచేందుకే విపక్షాలు ఎస్ఐఆర్‌ను లేవనెత్తుతున్నాయి'' అని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. అమిత్ షా ప్రసంగిస్తున్న సమయంలోనే విపక్షాలు వాకౌట్ చేయడంపై స్పందిస్తూ.. అక్రమ వలసదారులను గుర్తించి, తొలగించి, వెనక్కి పంపించడమే ఎన్డీయే విధానమని, విపక్షాలు వాకౌట్ చేసినా సరే.. ఓటరు జాబితాలో ఏ ఒక్క అక్రమ వలసదారుడు ఉండటానికి వీల్లేదన్నారు. దేశంలో ఇటువంటి వారిని లేకుండా చేయాలని అనుకుంటున్నామన్నారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తే పశ్చిమ బెంగాల్, తమిళనాడు నుంచి ఆయా పార్టీలు తుడిచి పెట్టుకుపోతాయని విపక్ష పార్టీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియను తృణమూల్ కాంగ్రెస్ అడ్డుకుంటే బెంగాల్‌లో భాజపా గెలుపు ఖాయమన్నారు.

## రైలు టికెట్ ధరలు మనదగ్గరే తక్కువ

**: అశ్వినీ వైష్ణవ్**



అభివృద్ధి చెందిన దేశాలు, పొరుగుదేశాలతో పోలిస్తే భారత్‌లోనే రైలు టికెట్ ధరలు తక్కువగా ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. వీటి ధరలు తక్కువగా ఉంచేందుకు గతేడాది రూ.60వేల కోట్లు సబ్సిడీ అందించామన్నారు. వయోవృద్ధులకు రైలు టికెట్ రాయితీని పునరుద్ధరించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అని కాంగ్రెస్ ఎంపీ ఎంకే విష్ణు ప్రసాద్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి ఈ సమాధానమిచ్చారు. "పొరుగు దేశాలతో పోలిస్తే మనదగ్గర రైలు టికెట్ ధరలు చాలా అందుబాటులో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ధరల్లో ఇవి ఐదు నుంచి పది శాతం మాత్రమే. గతేడాది దాదాపు రూ.60వేల కోట్లు రాయితీల కోసం అందించాం. తద్వారా ప్రయాణికుల టికెట్ ధరలు అందుబాటులో ఉన్నాయి'' అని రైల్వే మంత్రి వివరణ ఇచ్చారు. కరోనా విజృంభణ సమయంలో రైళ్లలో సీనియర్ సిటిజన్ ప్రయాణ టిక్కెట్ల రుసుములో ఇచ్చే రాయితీలను కేంద్రం ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వాటిని పునరుద్ధరించలేదు.

## కోర్టు విచారణకు వెళ్తుండగా ప్రత్యక్ష సాక్షిని ఢీకొన్న ట్రక్కు





కోల్‌కతా: ఓ కేసు విషయంలో తృణమూల్ కాంగ్రెస్ నేతకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు వెళ్తున్న ప్రత్యక్ష సాక్షి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారు వెళ్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ప్రత్యక్ష సాక్షికి తీవ్ర గాయాలు కాగా అతడి కుమారుడు, కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో గతేడాది మహిళలపై వేధింపులు, భూ ఆక్రమణ కేసుల్లో ప్రధాన నిందితుడైన షాజహాన్‌పై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు విషయంలో కోర్టు ముందు హాజరవ్వడానికి కీలక సాక్షి భోలానాథ్ ఘోష్ వెళ్తుండగా.. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బోయ్‌రామారి పెట్రోల్ పంప్ సమీపంలో వేగంగా వచ్చిన ట్రక్కు వారి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భోలానాథ్‌కు తీవ్ర గాయాలు కాగా అతడి చిన్న కుమారుడు సత్యజిత్ ఘోష్ (32), కారు డ్రైవర్ సహనూర్ (27) ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం అనంతరం ట్రక్కును అక్కడే వదిలేసి, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ట్రక్కు ఉద్దేశపూర్వకంగానే కారును ఢీకొట్టి.. సమీపంలో ఉన్న వాగులోకి లాక్కెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేపట్టారు. షాజహాన్ షేక్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతున్నాడనే కక్షతో ఉద్దేశపూర్వకంగానే నిందితుడి అనుచరులు ఈ దారుణానికి పాల్పడ్డారని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జైలు నుంచి షాజహాన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తన తండ్రిని హతమార్చడానికి కుట్ర పన్నారని భోలానాథ్ పెద్ద కుమారుడు బిశ్వజిత్ ఆవేదన వ్యక్తం చేశారు.



### నేను 'స్లీపింగ్ పార్ట్‌నర్'ని మాత్రమే
## గోవా నైట్‌క్లబ్ సహ యజమాని గుప్తా

గోవా నైట్‌క్లబ్ అగ్ని ప్రమాదంపై దర్యాప్తును అధికారులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో క్లబ్‌ను లూథ్రాలకు లీజుకిచ్చిన యజమాని అజయ్‌గుప్తాను దిల్లీలో మంగళవారం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన అనంతరం అతడి డ్రైవర్ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు గుప్తాను హరియాణా నెంబర్ ప్లేట్ ఉన్న ఇన్నోవా కారులో ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. అయితే దర్యాప్తులో నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలు చేస్తున్న వ్యాపారంలో తాను 'స్లీపింగ్ పార్ట్‌నర్'గా మాత్రమే ఉన్నానని.. క్లబ్ అక్రమాలపై వస్తున్న ఆరోపణలతో తనకేమీ సంబంధం లేదని అతడు పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. గుప్తాను త్వరలో కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కోర్టు అనుమతిచ్చిన అనంతరం గోవా పోలీసులు నిర్వహిస్తున్న ట్రాన్సిట్ రిమాండ్ కోసం అతడిని గోవాకు తరలించనున్నట్లు తెలిపారు. మరోవైపు లూథ్రా సోదరులకు సంబంధించిన నివాసాలు, ఆస్తులపై దిల్లీ, గోవా పోలీసులు సంయుక్త దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితులైన యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాల కోసం ఇంటర్‌పోల్ ఇప్పటికే బ్లూ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పరారైన వారిపై సీబీఐ విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ సంస్థ మంగళవారం ఈ నిర్ణయం తీసుకుంది.

## ఒకవైపు సంక్షోభం ఉంటే.. టికెట్ ధర రూ.40వేలా..?

**: కేంద్రానికి హైకోర్టు ప్రశ్న**

దిల్లీ: ఇండిగో సంక్షోభంపై దిల్లీ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. అసలు ఈ సంక్షోభం ఎందుకు తలెత్తిందని కేంద్రాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఇలాంటి సమయంలో విమాన టికెట్ ధరలు అమాంతం ఎందుకు పెరిగాయని అడిగింది. "ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. దాని నుంచి ప్రయోజనం పొందేందుకు ఇతర విమానయాన సంస్థలకు అనుమతి ఎలా లభించింది. టికెట్ ధర రూ. 40వేల వరకు ఎలా వెళ్లింది..? ఇదంతా ఎలా జరిగింది'' అని కోర్టు ప్రశ్నించింది. ఇండిగో వందల సంఖ్యలో సర్వీసుల్ని రద్దు చేయడంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఆ ఎఫెక్ట్‌తో ఇతర విమానయాన సంస్థల్లో టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు దాదాపు రెండు, మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ముంబయిదిల్లీ మధ్య



విమాన సర్వీసుల టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ఒక ఎకానమీ టికెట్‌కు రూ.35వేలు వసూలు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. సాధారణంగా ఆ మార్గంలో ప్రయాణించేందుకు చివరి నిమిషంలో బుక్ చేసినా.. విమానంలో వెళ్లిరావడానికి రూ.20వేలు ఖర్చవుతాయని పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదలపై కేంద్రం పరిమితులు విధించింది. అయితే ఈ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమైందని హైకోర్టు పేర్కొంది. "ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను అభినందిస్తున్నాం. అయితే ఇక్కడ మా ప్రశ్న ఏంటంటే.. అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. దీనికి ఎవరు కారణం..? ఇక్కడ ప్రయాణికులు చిక్కుకుపోవడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగింది. చిక్కుకుపోయిన ప్రయాణికుల కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు ఏంటి..?'' అని న్యాయస్థానం ప్రశ్నించింది. దాంతో ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వెల్లడించారు. ఆ సమాధానంతో న్యాయస్థానం సంతృప్తి చెందలేదు. "సంక్షోభం వచ్చాక మీరు ఆ చర్యలు తీసుకున్నారు. మా ప్రశ్న అదికాదు. అసలు ఆ సమస్య ఎందుకు వచ్చింది..? అప్పటివరకు మీరు ఏం చేస్తున్నారు..? అలాగే పైలట్లు ఎందుకు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తుంది..? ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?'' అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇండిగో తగినంతమంది పైలట్లను నియమించుకోవాలని, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే.. ఇండిగో విమాన సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తున్నామని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనివల్ల ఆ సంస్థ సర్వీసులను స్థిరీకరించవచ్చని, రద్దులను తగ్గించవచ్చని తెలిపారు. ఇది ఇండిగోకు భారీ ఎదురుదెబ్బ అవుతుందని తెలుస్తోంది. ఆ పదిశాతం ఆకాశ స్పైస్‌జెట్ మొత్తం వాటాకు సమానం కావడం గమనార్హం. ఇండిగో సంక్షోభంతో మార్కెట్లో ఏర్పడిన డిమాండ్‌ను అందిపుచ్చుకొనేందుకు స్పైస్‌జెట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. దాంతో దాని శీతాకాల షెడ్యూల్‌లోకి అదనంగా 100 సర్వీసులు చేర్చనున్నట్లు ప్రకటించింది.

## హసీనా అప్పగింతపై.. భారత్‌ను ఒప్పించేందుకు ప్రయత్నిస్తాం: బంగ్లాదేశ్

భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి రప్పించేందుకు దౌత్యపరంగా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటామని బంగ్లాదేశ్ తెలిపింది. ఏదేమైనా హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి రావడమనేది భారత్ చేతుల్లో ఉందని పేర్కొంది. ఆమెను వెనక్కి పంపించేలా భారత్‌ను ఒప్పించేందుకు ప్రయత్నిస్తామని బంగ్లా విదేశీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ తౌహిద్ హొస్సేన్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుల్లో గత నెలలో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లో న్యాయస్థానాలు ఆమెకు 21 ఏళ్లు, ఐదేళ్ల జైలుశిక్ష విధించాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆమెను అప్పగించాలని ఢాకా డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంపై ఇటీవల భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ.. "ప్రత్యేక పరిస్థితుల్లో హసీనా భారత్‌కు వచ్చారు. తుది నిర్ణయం ఆమే స్వయంగా తీసుకోవాలి'' అని చెప్పారు.

# అమరావతిలో కాగ్ కార్యాలయం నిర్మాణానికి పరిపాలన అనుమతులు: పెమ్మసాని

అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో సీఏజీ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) కార్యాలయ భవనం నిర్మాణానికి పరిపాలన అనుమతులు లభించినట్టు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 2.05 ఎకరాలలో అత్యాధునిక సదుపాయాలతో భవన నిర్మాణానికి అనుమతులు వచ్చాయని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమరావతిని శక్తిమంతమైన, పూర్తి స్థాయి పాలనాకేంద్రంగా తీర్చిదిద్దే దశలో ఇదో దృఢమైన అడుగు అని పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తి మేరకు అమరావతిలో కాగ్ నూతన కార్యాలయ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు.

*** రూ.80 కోట్లతో తపాలాశాఖ ప్రాంతీయ కార్యాలయం**

అమరావతిలో రూ.80 కోట్లతో అత్యాధునిక రీతిలో తపాలాశాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్మించబోతున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం లోక్‌సభలో రాష్ట్రంలో కొత్త పోస్టాఫీసుల నిర్మాణంపై అనంతపురం సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఈ విషయం చెప్పారు. 202021 నుంచి 202425 మధ్యకాలంలో రాష్ట్రంలో అయిదు కొత్త పోస్టాఫీసులు నిర్మించినట్లు తెలిపారు.



కర్నూలు జిల్లా ప్యాపిలి, వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, సత్తెనపల్లి, చిలకలూరిపేట, ఏలూరు జిల్లా ఉంగుటూరుల్లో అద్దె భవనాల్లో నడుస్తున్న పోస్టాఫీసులను త్వరలో శాశ్వత భవనాల్లోకి మార్చనున్నట్లు చెప్పారు. ఇందులో ప్యాపిలి, దాచేపల్లిలను ఈ ఆర్థిక సంవత్సరంలో, మిగిలిన నాలుగింటిని వచ్చే సంవత్సరం శాశ్వత భవనాల్లోకి మార్చనున్నట్లు వెల్లడించారు.

## కడప మాజీ మేయర్ సురేష్‌బాబుకు హైకోర్టులో ఎదురు దెబ్బ




అమరావతి: కడప మాజీ మేయర్ కె.సురేష్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కడప మేయర్ ఎన్నిక నిర్వహణ కోసం ఈనెల 4న రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ సురేష్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం వెల్లడించింది. మేయర్‌గా తనను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమంటూ పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు 2026 మార్చిలో ముగుస్తుందన్నారు. కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నిక నిర్వహించడానికి పురపాలక చట్టం నిబంధనలు అనుమతించవన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని ప్రక్రియను నిలువరించాలని కోరారు. ఆరు నెలల ముందు ఎన్నిక నిర్వహించకూడదనే నిబంధన మేయర్ పదవి విషయంలో వర్తించదని ఎస్ఈసీ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. సభ్యుడి విషయంలో ఆ నిబంధన చెల్లుబాటు అవుతుందన్నారు. మేయర్ ఎన్నిక పరోక్ష ఎన్నిక అని తెలిపారు. ప్రక్రియను నిలువరించొద్దని కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం సురేష్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## ఇండిగో సంక్షోభం సమసిపోనుంది
## విశాఖ విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం

విశాఖపట్నం : ఇండిగో సంస్థలో నెలకొన్న సంక్షోభం సమసిపోయి రెండురోజుల్లో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. బుధవారం స్థానిక విమానాశ్రయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 3 నుంచి 10వ తేదీ



వరకు 125 విమాన సర్వీసుల రాకపోకలు రద్దుకాగా.. ఇందులో ఇండిగో సర్వీసులు 122 ఉన్నాయన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మంచినీరు, ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. 7వ తేదీ నుంచి విమాన సర్వీసుల రద్దు క్రమంగా తగ్గుతూ వస్తోందన్నారు. మిగిలిన ఎయిర్‌లైన్స్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. ప్రయాణికులకు 21 లగేజీలు అప్పగించామని.. ఇంకో ఆరు బ్యాగులు డోర్ డెలివరీ ద్వారా ఇండిగో అందిస్తుందన్నారు. విమానం రద్దు అయిన ప్రయాణికులకు రీఫండ్ మొత్తాన్ని చెల్లించారన్నారు. ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండానే రీషెడ్యూలింగ్ సౌకర్యం కల్పించామన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిత్యం ప్రయాణికులకు విమాన సర్వీసులపై సమాచారం అందిస్తున్నామన్నారు.

## పంచాయతీరాజ్‌లో పదివేల మందికి పదోన్నతులు

**: డిప్యూటీ సీఎం పవన్**

మంగళగిరి: పల్లెలే దేశానికి వెన్నెముక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. ''పల్లెల కోసమే పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. పదేపదే సమీక్షలు నిర్వహించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత



ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించాను. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతులు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలి. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉంది'' అని పవన్ అన్నారు.

## రెండు నెలల పాటు పర్వదినాల్లో
## వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే

తిరుమల: డిసెంబరు, వచ్చే ఏడాది జనవరిలో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఆయా రోజుల్లో రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం), 29న (వైకుంఠ ఏకాదశి ముందు రోజు), డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు (వైకుంఠ ద్వార దర్శనాలు), జనవరి 25 (రథ సప్తమి) కారణంగా ఈ పర్వదినాల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తితిదే ప్రకటనలో పేర్కొంది. పర్వదినాలకు ముందురోజు వీఐపీ దర్శనాలకు సంబంధించి



ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి భక్తులు దేవస్థానం సిబ్బందికి సహకరించాలని కోరింది.

## రూ.వందల కోట్లు దోచుకొని
## చిన్న దొంగతనం అంటావా: జ్యోతుల నెహ్రూ

అమరావతి: హిందువులపై జగన్‌కి ఎంత ద్వేషం ఉందో ఆయన తీరు చూస్తే అర్థమవుతుందని తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి చోరీ కేసు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి హుండీ డబ్బులు లెక్కించే క్రమంలో చోరీకి పాల్పడి .. కొన్ని వందల కోట్ల రూపాయలు సంపాదించారని, దానిని చిన్న దొంగతనంగా చూపించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ''రూ. వేల కోట్లు దొచుకున్న మీకు.. పరకామణి చోరీ కేసు చిన్నదిగా కనిపించడం సహజమే. జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి.. నూటికి నూరు శాతం పరకామణి కేసులో భాగంగా ఉన్నారనేది వాస్తవం. ఒక్కసారి గతానికి వెళ్తే.. వీళ్లు కేసులను ఎలా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారో అందరికీ తెలుస్తుంది. వైఎస్ వివేకా, పరిటాల రవి కేసుల్లో సాక్షులను హతమార్చారు. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేస్తున్నారు. ఎవరైతే వాస్తవాలను నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారో.. వారందరినీ వేధించడం, భయపెట్టడం, అవసరమైతే హత్యలు



చేస్తున్నారు'' అని జ్యోతుల నెహ్రూ ఆరోపించారు.

## నాలుగేళ్ల చిన్నారికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్




విజయనగరం: గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదైంది. బొండపల్లి మండలం మరువాడ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి మూడు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో ఏరియా ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ టెస్ట్ చేశారు. రిపోర్టులో పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ర్యాపిడ్ టెస్ట్, ఎలీసా టెస్ట్‌లో కూడా పాజిటివ్ వచ్చిందని గజపతినగరం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి ప్రవీణ్ చెప్పారు. దీంతో మరువాడ గ్రామంలో అధికారులు క్లోరినేషన్‌ను చేపట్టారు.

## అమరావతి బాలోత్సవం..
## ఆకట్టుకున్న సంప్రదాయ నృత్య ప్రదర్శనలు

**విజయవాడ సిటీ: విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న అమరావతి బాలోత్సవం ఉత్సాహంగా కొనసాగుతోంది. రెండో రోజు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. దేశభక్తి, అభ్యుదయ గీతాలను ఆలపించారు. జానపద నృత్యాలతో హోరెత్తించారు. పలువురు చిన్నారులు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించి మాతృభాషాభిమానాన్ని చాటుకున్నారు.**













## ఆంధ్రప్రదేశ్‌లో విద్యావిధానం భేష్

**: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మంచి విద్యా విధానాలు అమలు చేస్తున్నారని కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. ''సీఎస్ఆర్ నిధులతో ఏపీలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం బాగుంది. ఇతర రాష్ట్రాలకు కూడా అలాంటి విధానాలు అవలంభించవచ్చు. ఆంధ్రా మోడల్ బాగుంది, ఇతర రాష్ట్రాలూ మంచి సృజనాత్మక విధానాలు అవలంభిస్తున్నాయి. ఏపీలో నాణ్యమైన విద్యా విధానం అమల్లో చంద్రబాబు, లోకేశ్ చొరవ బాగుంది'' అని కితాబిచ్చారు.



# యూఎస్ ఫెడ్ భేటీ ఎఫెక్ట్

**నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**యూఎస్ ఫెడ్ భేటీకి ముందు నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**275 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 81 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**టాటా స్టీల్, సన్ ఫార్మా షేర్లు లాభపడగా, ఎటర్నల్, ట్రెంట్ కు నష్టాలు**




**ముంబై:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లపై నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 275.01 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 81.65 పాయింట్లు కోల్పోయి 25,758 వద్ద ముగిసింది.

మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,940%-%26,050 జోన్‌లో బలమైన నిరోధం ఎదురవుతోంది. మార్కెట్ మళ్లీ పుంజుకోవాలంటే 26,000 స్థాయిని కచ్చితంగా దాటాల్సి ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ నిఫ్టీ 25,700 స్థాయికి దిగువన స్థిరపడితే 25,500 వరకు పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. బ్యాంక్ నిఫ్టీ కూడా దాదాపు 0.4 శాతం నష్టపోయి 58,990 వద్ద ముగిసింది. ఇది ప్రస్తుత ర్యాలీకి తాత్కాలిక విరామమే తప్ప ట్రెండ్ మార్పు కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.

సెన్సెక్స్ స్టాక్స్‌లో టాటా స్టీల్, సన్ ఫార్మా, ఐటీసీ షేర్లు లాభపడగా, ఎటర్నల్, ట్రెంట్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయి సూచీని కిందకు లాగాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ బలహీన వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.12 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.90 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు నష్టపోగా, మెటల్, మీడియా రంగాల షేర్లు లాభపడ్డాయి.

అందరి దృష్టి ఇప్పుడు యూఎస్ ఫెడ్ సమావేశంపైనే ఉంది. ఈ భేటీలో ఫెడ్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటును తగ్గించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, 2026లో మరిన్ని కోతలపై స్పష్టత వస్తుందా లేదా అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

## 2030 నాటికి భారత్‌లో అమెజాన్ 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..

**భారీగా ఉద్యోగాలు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో భారీ పెట్టుబడులు పెట్టనుంది. 2030 నాటికి దేశంలోని అన్ని వ్యాపారాల్లో 35 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ విషయాన్ని కంపెనీ అధికారి ఒకరు తాజాగా వెల్లడించారు.

దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అమెజాన్ సంభవన్ 2025 నిర్వహిస్తోంది. ఇందులోనే భారతదేశంలో పెట్టుబడులకు సంబంధించి అమెజాన్ అధికారిక ప్రకటన చేసింది. 2030 నాటికి 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెజాన్ సీనియర్ అధికారి అమిత్ అగర్వాల్ ప్రకటించారు. ఏఐ, ఉద్యోగాల కల్పన, వ్యాపార విస్తరణపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడులు కంపెనీ విస్తరణకే కాదు భారతదేశ అభివృద్ధికి ఉత్ప్రేరకంగా ఉపయోగపడతాయని అన్నారు. కాగా, 2010 నుంచి ఇప్పటివరకు అమెజాన్ భారతదేశంలో 40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టింది. దీనికి అదనంగా వచ్చే ఐదేళ్లలో అంటే 2030 నాటికి మరో 35 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది.

అంతేకాదు, 2030 నాటికి భారత్‌లో అమెజాన్ అదనంగా 1 మిలియన్ (10 లక్షల) ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించాలని యోచిస్తోంది. కేవలం ప్యాకేజింగ్, లాజిస్టిక్ విభాగాల్లోనే కాకుండా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగాలను కల్పించనున్నట్లు అమెజాన్ వెల్లడించింది. భారతదేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, చిన్న మధ్య తరహా వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెజాన్ ప్రకటించింది.

## భారత్‌లో యాపిల్ ఐదో స్టోర్..

**నేడే ఓపెనింగ్**



**న్యూఢిల్లీ:** దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ భారత్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరిస్తోంది. ఐ-ఫోన్లు, ఇతర ఉత్పత్తులకు భారత్ బెస్ట్ మార్కెట్‌గా నిలిచిన నేపథ్యంలో ఇండియాలో తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. ఇక ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పూణెలో రిటైల్ స్టోర్ల ను తెరిచిన సంస్థ.. ఇప్పుడు మరో స్టోర్‌ను తెరిచేందుకు సిద్ధమైంది. డిసెంబర్ 11న అంటే రేపే నోయిడాలో కొత్త స్టోర్‌ను తెరవబోతోంది. ఇది నోయిడాలో తొలి రిటైల్ స్టోర్ కాగా దేశంలో ఐదోది . నోయిడా సెక్టార్ 18లోని డీఎల్‌ఎఫ్ మాల్‌లో ఈ కొత్త స్టోర్ లొకేట్ అయ్యిఉంది. ఈ స్టోర్‌లో మొత్తం 80 మంది టీమ్‌మెంబర్స్ ఉంటారు. ఈ స్టోర్‌ను సందర్శించే కస్టమర్లు ఐఫోన్ 17 సిరీస్‌తో సహా కొత్త ఉత్పత్తి శ్రేణిని అన్వేషించవచ్చు. కొత్త ఫీచర్ల గురించి తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఐఫోన్, మాక్, యాపిల్ వాచ్, ఐప్యాడ్ వంటి ఇతర యాపిల్ ఉత్పత్తులను కొనుగోలు చేయొచ్చు.

కాగా, భారత్‌లో యాపిల్ తన తొలి రిటైల్ స్టోర్‌ను 2023 ఏప్రిల్‌లో ముంబై బీకేసీలో ప్రారంభించిన విషయం తెలిసిందే. భారతదేశంలో ఇదే అతిపెద్ద యాపిల్ స్టోర్. ఆ తర్వాత రెండో స్టోర్‌ను అదే ఏడాది ఢిల్లీ సాకేత్‌లో ఓపెన్ చేసింది. ఈ రెండు స్టోర్ల నుంచి తొలి ఏడాదే సంస్థకు దాదాపు రూ. 800 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. ఇక ఈ ఏడాది సెప్టెంబర్2వ తేదీన బెంగళూరు ఫీనిక్స్ మాల్‌లో మూడో స్టోర్, అదే నెల 4వ తేదీన పూణెలోని కోరెగావ్ పార్క్‌లో నాలుగో రిటైల్ స్టోర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నాలుగు యాపిల్ రిటైల్ స్టోర్లు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కస్టమర్లకు సేవలు అందిస్తున్నాయి.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 2వ స్థానానికి విరాట్..







**ఆధిపత్యం కొనసాగించిన రోహిత్..!**

**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆధిపత్యం కొనసాగించారు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నారు. ఇప్పటికే నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో రన్ మిషన్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం నెంబర్ వన్ ప్లేస్‌ను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ.. అగ్రస్థానానికి చేరుకునేందుకు కేవలం ఎనిమిది రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల్లో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లీ అజేయంగా 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండుస్థానాలు మెరుగుపరుచుకొని రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు.

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో స్థిరంగా రాణిస్తూ తన నెంబర్ వన్ ప్లేస్‌ను నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 146 పరుగులు చేశాడు. కోహ్లీ, రోహిత్ ఇద్దరు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-2 ప్లేసుల్లో నిలిచారు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో ఉన్నాడు. మరో బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఒక ర్యాంకు దిగజారి 10వ స్థానానికి చేరుకున్నాడు. కేఎల్ రాహుల్ రెండు స్థానాలను మెరుగుపరుచుకొని 12వ ప్లేస్‌కు చేరాడు. ఇక బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని మూడోస్థానంలో నిలిచాడు.

టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా బ్యాట్స్‌మెన్ యశస్వీ జైస్వాల్ మాత్రమే ఎనిమిది స్థానంలో నిలువగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 11వ స్థానం, రిషబ్ పంత్ 13వ స్థానాలకు చేరుకున్నారు. టెస్ట్ బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ ప్లేస్‌ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఒక్కో స్థానాన్ని మెరుగుపరుచుకొని వరుసగా 12వ, 13వ, 14వ స్థానాల్లో నిలిచారు.

అదే సమయంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్‌రమ్, టెంబా బావుమా సైతం తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. అదే సమయంలో యాషెస్‌లో రెండు మ్యాచ్‌ల్లో 18 వికెట్లు తీసిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడోస్థానానికి ఎగబాకాడు. పేలవమైన బ్యాటింగ్ కారణంగా హ్యారీ బ్రూక్ నాల్గో ప్లేస్‌కు పడిపోయాడు. కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ ఒక్కొక్క స్థానం మెరుగుపరుచుకున్నారు.

## సెలక్షన్ వివాదం.. కోచ్ తల పగలగొట్టిన క్రికెటర్లు

**జట్టులోకి తీసుకోలేదని పుదుచ్చేరి అండర్-19 కోచ్‌పై దాడి**

**దాడిలో కోచ్ వెంకటరామన్ తలకు తీవ్ర గాయం, భుజం ఫ్రాక్చర్**

**ముగ్గురు స్థానిక క్రికెటర్లపై ఎఫ్ఐఆర్ నమోదు**

**ఓ ఫోరం కార్యదర్శి ప్రోద్బలంతోనే దాడి జరిగిందని కోచ్ ఆరోపణ**



**పుదుచ్చేరి:** పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్‌లో తీవ్ర కలకలం రేగింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి జట్టులో చోటు దక్కలేదన్న ఆగ్రహంతో ముగ్గురు స్థానిక క్రికెటర్లు అండర్-19 హెడ్ కోచ్ ఎస్. వెంకటరామన్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయమవగా, భుజం విరిగింది.

పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 8న ఉదయం 11 గంటల సమయంలో క్యాప్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ నెట్స్‌లో ఈ దాడి జరిగింది. సీనియర్ క్రికెటర్ కార్తికేయన్ జయసుందరం, ఫస్ట్-క్లాస్ ఆటగాళ్లు ఎ. అరవిందరాజ్, ఎస్. సంతోశ్ కుమారన్ తనపై దాడి చేశారని వెంకటరామన్ సెదరపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమను జట్టులోకి ఎంపిక చేయకపోవడానికి కారణం నువ్వేనంటూ దూషిస్తూ దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. అరవిందరాజ్ తనను పట్టుకోగా, సంతోశ్ ఇచ్చిన బ్యాట్‌తో కార్తికేయన్ తనను చంపే ఉద్దేశంతో తలపై కొట్టాడని ఫిర్యాదులో తెలిపారు. ఈ దాడి వెనుక భారతిదాసన్ పాండిచ్చేరి క్రికెటర్స్ ఫోరం కార్యదర్శి జి. చంద్రన్ ప్రోద్బలం ఉందని ఆయన ఆరోపించారు.

ఈ ఘటనలో వెంకటరామన్ తలకు 20 కుట్లు పడ్డాయని, ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని సబ్-ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజేశ్ తెలిపారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు.

## తొలి భారత బ్యాట్స్‌మన్‌గా తిలక్ వర్మ రేర్ రికార్డు!



**ఒడిశా:** మంగళవారం రాత్రి ఒడిశాలోని కటక్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ అద్భుతమైన విజయంతో పాటు ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు అనేక రికార్డులను నెలకొల్పారు.

ఈ మ్యాచ్‌లో భారత్ దక్షిణాఫ్రికాను 74 పరుగులకే ఆలౌట్ చేసింది. దక్షిణాఫ్రికా టీ20 చరిత్రలో ఇదే అత్యల్ప స్కోరు. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ప్రతి బౌలర్ కనీసం ఒక వికెట్ తీశారు. గతంలో దక్షిణాఫ్రికా అత్యల్ప స్కోరు 87. 2022లో రాజ్‌కోట్‌లో ఈ స్కోర్ నమోదైంది. టీ20 చరిత్రలో దక్షిణాఫ్రికా నాలుగు అత్యల్ప స్కోర్లు చేస్తే.. అందులో మూడుసార్లు ప్రత్యర్థిగా టీమిండియానే ఉంది.

హార్దిక్ పాండ్యా టీ20ల్లో 100 సిక్సర్లు బాదాడు. దీంతో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ క్లబ్‌లో చేరాడు. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు రోహిత్ పేరిట ఉంది. టీ20ల్లో హిట్‌మ్యాన్ 205 సిక్సర్లు బాదాడు. సూర్య 155 సిక్సర్లతో రెండవ స్థానంలో ఉన్నాడు. విరాట్ 124 సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత 100 సిక్సర్లతో హార్దిక్ పాండ్యా ఉన్నాడు. కేఎల్ రాహుల్ 99 సిక్సర్లు బాది అరుదైన క్లబ్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు.

టీ20ల్లో తిలక్ వర్మ 1000 పరుగుల మార్కును చేరుకున్నాడు. 25 ఏళ్ల లోపు 1,000 టీ20 పరుగులు సాధించిన తొలి భారతీయ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. 2023 ఆగస్టులో వెస్టిండీస్‌పై 23 సంవత్సరాల 31 రోజుల వయసులో తిలక్ టీ20 అరంగేట్రం చేశాడు. టీ20ల్లో 1,000 పరుగులు చేసిన 13వ భారతీయుడు తిలక్. ఈ హైదరాబాద్ ఆటగాడు భారత్ తరఫున ఇప్పటివరకు 5 వన్డేలు, 37 టీ20లు ఆడాడు. ఇక భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండవ టీ20 డిసెంబర్ 11న పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్‌లో జరుగుతుంది.

## గౌతమ్ గంభీర్‌పై విమర్శలు చేస్తూ.. కొత్త వివాదానికి తెరలేపిన షాహిద్ అఫ్రిది!

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ మరోసారి భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు గుప్పించాడు. గంభీర్ ప్రారంభంలో తీసుకున్న నిర్ణయాలు ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పటికీ..

ఆ తరువాత అతని ఆలోచనలు సరిగా లేవన్నాడు. కొంతకాలం గౌతీ నిర్ణయాలు భారత జట్టుకు ప్రతికూలంగా మారాయని అఫ్రిదీ చురకలు అంటించాడు. మరోవైపు సీనియర్ భారత బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రదర్శనలను ప్రశంసించాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆడగలిగే సామర్థ్యం ఇద్దరిలో ఉందని, భారత జట్టుకు వారి అవసరం చాలా ఉందని పేర్కొన్నాడు. ఇటీవల ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై జరిగిన వన్డే సిరీస్‌ల్లో రో-కో ఫామ్ చూస్తే ఇంకా భారత జట్టుకు ఇంకా వారు వెన్నెముకనే అని అఫ్రిదీ చెప్పాడు.

తాజాగా టెలికాం ఏషియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షాహిద్ అఫ్రిదీ మాట్లాడుతూ%ౌ% 'విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు భారత బ్యాటింగ్ లైనప్‌లో కీలకమైన ఆటగాళ్లు. ఇటీవల వారు ఫామ్ చూస్తే 2027 వరల్డ్ కప్ వరకూ ఆడగలరని నాకు అనిపిస్తోంది. భారత జట్టుకు ఇంకా వారు వెన్నెముకనే. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై అద్భుతంగా ఆడారు. ఒకే ఫార్మాట్ ఆడుతున్నా.. రో-కోలు బాగా ఆడారు. ఐసీసీ లాంటి పెద్ద టోర్నమెంట్‌లలో ఈ స్టార్ ప్లేయర్లను భారత్ పూర్తిగా వినియోగించుకోవాలి. చిన్న జట్లపై వారికి విశ్రాంతి ఇస్తూ.. కొత్త ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలి' అని సూచించాడు.






షాహిద్ అఫ్రిదీ, గౌతమ్ గంభీర్ మధ్య ఎప్పటినుంచో వివాదం ఉంది. అందుకే గంభీర్‌ను విమర్శించడంలో అఫ్రిదీ ఎప్పుడూ వెనుకాడడు. దక్షిణాఫ్రికాపై టెస్ట్ ఓటమిపై గంభీరే కారణం అంటూ విమర్శలు గుప్పించాడు. 'కోచ్‌గా గంభీర్ ప్రారంభంలో ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకున్నాడు. ఇటీవల అతడి ఆలోచనలు సరైనవి కావని నిరూపితమైంది. ఎక్కువ ప్రయోగాలు మంచివి కావు. ఇలా అయితే కష్టమే' అని అఫ్రిదీ చెప్పుకొచ్చాడు. గంభీర్ కోచింగ్‌లో భారత్ లిమిటెడ్ ఓవర్స్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ గెలిచినా.. టెస్టుల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో సిరీస్ ఓటములు చవిచూసింది. కోచింగ్ నుంచి గంభీర్ తప్పుకుంటే మంచిదంటూ పరోక్షంగా అఫ్రిదీ కొత్త వివాదానికి తెర లేపాడు.

వన్డేల్లో తన అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టిన రోహిత్ శర్మపై షాహిద్ అఫ్రిదీ ప్రశంసలు కురిపించాడు. '2009 ఐపీఎల్‌లో డెక్కన్ చార్జర్స్ తరఫున ఆడినప్పుడు రోహిత్‌తో కలిసి ఆడాను. రోహిత్ బ్యాటింగ్‌ను నేను ఎప్పుడూ ఇష్టపడతా. ప్రాక్టీస్ సమయంలోనే అతని క్లాస్ చూశాను. ఒకరోజు భారత్‌కు ప్రధాన ఆటగాడవుతాడని అనుకున్నాను. అదే నిజమైంది. ఇప్పుడు నా రికార్డును అతడే బద్దలు కొట్టడం నాకు సంతోషంగా ఉంది' అని అఫ్రిదీ చెప్పుకొచ్చాడు.

### త్రివిక్రమ్-వెంకటేశ్ కాంబో ఆదర్శ కుటుంబం
# టైటిల్ ఖరారు




టాకీస్: త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'హౌస్ నం47 ' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ సింపుల్‌లుక్‌లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.

## MOVIE TIME

### అఖండ-2 విడుదలతో పలు
# సినిమాలు వాయిదా




టాకీస్: టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'అఖండ 2: తాండవం' 12 నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్‌టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి. ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల-సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం 'మోగ్లీ' ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన 'సైక్ సిద్దార్థ్' అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది.ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం 'శివాజీ' ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య-బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో 24గంటల్లోనే తేలనుంది.

# వారణాసిలో యుగయుగాల చరిత్ర
### ఐదు అవతారాల్లో కనిపించనున్న మహేశ్




టాకీస్: సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది.చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్ లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు.ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్పియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది. స్పియర్ బాల్‌పై మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు నెట్టింట్లో వేగంగా స్ప్రెడ్ కావడంతో అందరు నిజమేనని నమ్మారు. కాని వాస్తవానికి అవి అసలు నిజం కావని తర్వాత తేలింది. ఆ ఫుటేజ్, ఫోటోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమే అని పరిశీలనలో బయటపడింది. దీంతో చాలామంది అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్పియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లు, సినిమాలు అక్కడ తమ కంటెంట్‌ను ప్రదర్శిస్తున్న దృష్ట్యా, సరైన మొత్తాన్ని చెల్లిస్తే 'వారణాసి' టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రమోషన్ చేయవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

### దుమ్మురేపుతున్న
# మమ్ముట్టి సినిమా




టాకీస్: మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు. ఈ వీకెండ్ పెద్ద సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద లేకపోవడంతో ఈ చిత్రం మంచి కలెక్షన్లు రాబడుతుందని సమాచారం.

### సినిమా నిర్మాణం
# ఎవరి ఇష్టం వారిదే
### అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ




టాకీస్: సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. 'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.

### 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'
# రెండో సీజన్ రెడీ




టాకీస్: భారత స్వాతంత్య్ర పోరాటం, దేశ విభజన నాటి చారిత్రక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించిన ప్రముఖ వెబ్ సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' తన రెండో సీజన్‌తో రాబోతుంది. నిఖిల్ అద్వానీ దర్వకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ప్రముఖ రచయితలు డొమినిక్ లాపియర్, లారీ కాలిన్స్ రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' ఆధారంగా రాబోతుంది. తాజాగా ఈ దీనికి సంబంధించిన ట్రైలర్‌తో పాటు స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం విడుదల చేసింది. రెండో సీజన్‌ని జనవరి 9 నుంచి ప్రముఖ ఓటీటీ సోనిలివ్ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రెండో సీజన్ ట్రైలర్ చూస్తుంటే.. స్వాతంత్య్రం వచ్చిన వెంటనే దేశంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలను ఈ సిరీస్ ప్రస్తావించనుంది. స్వాతంత్య్రానంతరం భారత్ ఎదుర్కొన్న పెను సవాళ్లు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటంపై దృష్టి సారించింది. ముఖ్యంగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు అప్పటికింకా భారతదేశంలో భాగంగా లేని రాచరిక సంస్థానాలను ఏ విధంగా విలీనం చేశారు. అలాగే కీలకమైన కలకత్తాను పాకిస్థాన్ లో కలపకుండా ఎలా అడ్డుకున్నారు. చారిత్రక నగరం అయిన లాహోర్‌ని ఎలా వదులుకున్నారు అనేది ఇందులో ఆసక్తికరంగా సాగింది. మొదటి సీజన్ భారీ విజయం అందుకున్న నేపథ్యంలో దేశ నిర్మాణంలో మన నాయకులు పడిన శ్రమను తెలుసుకోవాలనుకునే చరిత్ర అభిమానుల్లో సీజన్ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.